


ఆ టెండర్ వైట్

- కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు రూపాయికే కూరగాయల సరఫరాలో గిమ్మిక్కులు
- నాణ్యతలేనివి అందిస్తున్నట్లు నిర్ధారణ
- ఎట్టకేలకు అధికారుల చర్యలు
- వెండర్‌కు నోటీసులు ఇచ్చినా బదులివ్వలే
- పాత టెండరుదార్లను పిలిపించిన జేసీ
- ఎల్2ను ఖరారు చేసే అవకాశం?





'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలు

శ్రీకాకుళం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో విద్యార్థుల భోజనాలకు సంబంధించి రూపాయికే కిలో చొప్పున కూరగాయలు సరఫరా చేసేందుకు టెండరు వేయడం.. అధికారులు సైతం ఖరారు చేసేయడం తెలిసిందే. కూరగాయల ధరలు మండిపోతుంటే రూపాయికే వాటిని ఎలా సరఫరా చేస్తారని, నాణ్యత లేని కూరగాయలను అందించి విద్యార్థులకు వండిపెడుతున్నారని 'ఆంధ్రజ్యోతి' ఈ ఏడాది జనవరిలో వరుస కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు దీనిపై అధికారులు స్పందించారు. కిలో చొప్పున టెండరు ఖరారు చేసుకున్న వెండర్‌ను తొలగించేశారు. నిబంధనల ప్రకారం కూరగాయలను సరఫరా చేయడంలేదని నిర్ధారణకు వచ్చి ఈ చర్యలు చేపట్టారు.

జేసీకి ఫిర్యాదులు..

కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు వెండర్ కూరగాయలను సక్రమంగా సరఫరా చేయడంలేదని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అయితే, కమిటీ తనిఖీకి వస్తున్న విషయమై వెండర్‌కు ముందుగానే సమాచారం అందేది. దీంతో కమిటీ వెళ్లిన రోజున అంతా నాణ్యమైన సరుకులు ఉండేవి. దీంతో జేసీ స్వయంగా రంగంలోకి దిగారు. పలు పాఠశాలలను పరిశీలించి కూరగాయల సరఫరాలో నిబంధనలు పాటించడం లేదని నిర్ధారించారు. ఆయన ఆదేశాలతో సమగ్ర శిక్ష ఏపీసీ వెండర్‌కు మూడు దఫాలు నోటీసులను జారీ చేశారు. కానీ, ఏ ఒక్క నోటీసుకూ వెండర్ నుంచి బదులు లేదు. వాస్తవంగా రూపాయికి కిలో చొప్పున కూరగాయలు సరఫరా చేయడం అసాధ్యం. కానీ, లెక్కల గిమ్మిక్కులతో వెండర్ ఇదంతా చేశారు. కొందరు అధికారులు సహకరించడంతో ఇన్నాళ్లు గడిచింది. ఆలస్యంగానైనా ఉన్నతాధికార యంత్రాంగం కళ్లు తెరిచి చర్యలకు ఉపక్రమించింది.

దరఖాస్తుదారులకు పిలుపు..

కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు కూరగాయలు సరఫరా చేసేందుకు ఎవరెవరు టెండర్లు దాఖలు చేశారో.. వాళ్లందరినీ జాయింట్ కలెక్టర్ గురువారం తన చాంబర్‌కు పిలిపించారు. పాత వెండర్‌ను తప్పించినట్లు వారికి చెప్పారు. అయితే, అన్ని రకాల కూరగాయలను పాత వెండరు ఖరారు చేసిన టెండరు ప్రకారమే రూ.203కే సరఫరా చేస్తామన్న వారికే కొత్త టెండర్ ఖరారు చేస్తామని చెప్పారు. ఈ లెక్కన చూసినా సరే.. మరలా రూపాయికే కిలో కూరగాయలను సరఫరా చేయాల్సి ఉంటుందని చెప్పి కొంతమంది దరఖాస్తుదారులు వెనకడుగేశారు. కొందరు మాత్రం కొత్తగా రీటెండర్‌ను పిలవాలని డిమాండ్ చేశారు. అయితే ఎల్2గా అప్పట్లో ఓ మహిళ.. అన్ని కూరగాయలను కలిపి రూ.229కే సరఫరా చేస్తామని టెండరు వేశారు. అయితే ఈమె ప్రస్తుతం వెండరుగా ఉన్న వ్యక్తి బంధువని సమాచారం. ఎల్2 టెండరు దరఖాస్తును పరిగణలోకి తీసుకోవాలని కొందరు వ్యాపారులు, కొత్తగా టెండరు వేయాలని మరికొందరు ఒత్తిడి తెచ్చారు. దీంతో గురువా రం రాత్రి వరకు టెండరు ఖరారు కాలేదు. అన్ని రకాల కూరగాయలను రూ.229కే ఎల్2గా వేసినా.. కొన్ని కూరగాయల ధరలు రూపాయి కంటే అధికంగా ఉన్నాయి. దీంతో ఎల్2కే టెండర్ ఖరారు అవుతుందని విశ్వసనీ య సమాచారం. అలాగే, చికెన్, గుడ్లు పాలు, పప్పు దినుసులను సరఫరా చేస్తున్న కాంట్రాక్టును కూడా రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని ప్రజలు కోరుతున్నారు. సోమవారం టెండర్లను పిలవనున్నారు.

ఎలాగున్నాడో.. ఎప్పుడొస్తాడో?

- భర్త కోసం భార్య, కుటుంబీకుల ఎదురుచూపు
- ఇరాన్ ప్రభుత్వ ఆధీనంలో గార్లపాడు వాసి
- షిప్‌లో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న వైనం
- తొమ్మిది నెలలుగా అక్కడే బందీగా..

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇరాన్‌లో బందీగా మారిన భర్త కోసం భార్య, కుటుంబీకులు అల్లాడిపోతున్నారు. తొమ్మిది నెలలు అవుతున్నా ఇంకా విడిచిపెట్టకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎలాగున్నాడో.. ఎప్పుడొస్తాడో అని కన్నీటిపర్యంతమవుతున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇదీ మండలంలోని గార్లపాడు ఆర్అండ్ఆర్‌కాలనీకి చెందిన పతివాడ వెంకటరావు కుటుంబ పరిస్థితి.



వెంకటరావు

ఇదీ జరిగింది..

వెంకటరావు దుబాయ్‌కు చెందిన ఓ కంపెనీ షిప్‌లో కెప్టెన్‌గా ఐదేళ్లుగా పనిచేస్తున్నాడు. గతేడాది జనవరి 24న దుబాయ్ నుంచి షిప్‌లో క్రూడాయిల్‌ను తీసుకుని ఇరాన్ వెళ్లాడు. అయితే, ఓవర్ లోడ్‌తో షిప్ వచ్చిందని ఇరాన్ ప్రభుత్వం ఆ షిప్‌ను స్వాధీనం చేసుకుంది. అప్పటికి షిప్‌లో సుమారు 14 మంది ఉద్యోగులు ఉన్నారు. వెంకటరావు కెప్టెన్‌గా ఉండడంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని మిగిలిన వారిని విడిచిపెట్టింది. వెంకటరావును విడిచిపెట్టాలంటే షిప్ యజమానిని తమకు అప్పజెప్పాలని, లేదా అపరాధ రుసుమైనా చెల్లించాలని ఇరాన్ ప్రభుత్వం షరతు విధించింది. మరో 15 రోజుల్లో వెంకటరావు షిప్ దిగిపోతాడన్న సమయంలో దాని యజమాని ఆ షిప్‌ను వేరొకరికి విక్రయించాడు. నూతన యజమాని షిప్‌ను విడిపించేందుకు సుముఖత చూపటంలేదు. మొదటి యజమాని సైతం పట్టించుకోవడం లేదు. దీంతో 9 నెలలుగా ఇరాన్ ప్రభుత్వ బందీగా వెంకటరావు ఉండిపోయాడు. ఈ విషయాన్ని శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర పౌరవిమానయానాశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి వెంకటరావు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఇరాన్ ప్రభుత్వం నుంచి వెంకటరావును విడిపించాలని వినతిపత్రాలు అందించారు. దీంతో ఆయన్ను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని వారు హామీ ఇచ్చారని, అయినా ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదని వెంకటరావు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వెంకటరావు రాకకోసం భార్య స్వాతి, తల్లిదండ్రులు సిమ్మన్న, చిన్నమ్మడు, ఇతర కుటుంబ సభ్యులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.



పాపతో స్వాతి

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి..

నా భర్త వెంకటరావు ఇంటి నుంచి వెళ్లి ఏడాదిన్నర కావస్తుంది. నేను 3 నెలల గర్భవతిగా ఉన్నప్పుడు దుబాయ్ వెళ్లాడు. ఇప్పుడు పాప పుట్టి సుమారు 8 నెలలు అవుతుంది. నా భర్త ఇంటికి సంతో షంగా వస్తాడనుకున్న సమయంలో ఇరాన్ ప్రభుత్వ బందీగా మారాడు. అప్పటి నుంచి తీవ్ర మానసికక్షోభ అనుభవిస్తున్నా. ప్రభుత్వం జోక్యం చేసుకుని నా భర్తను ఇరాన్ ప్రభుత్వం నుంచి విడిపించాలి.

-స్వాతి, వెంకటరావు భార్య

జీతాల్లేవ్.. తిండీ లేదు!

- విదేశీ ఉద్యోగాల పేరిట ఘరానా మోసం
- మస్కట్‌లో చిక్కుకున్న జిల్లా కార్మికులు
- వారితో షిప్‌లను క్లీనింగ్ చేయిస్తున్న వైనం
- పాస్‌పోర్టులు కూడా తీసుకుని బెదిరింపులు
- ఆందోళనలో బాధిత కుటుంబ సభ్యులు
- ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తాం: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు హామీ



వీడియోకాల్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

బాధితులతో మాట్లాడిన రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మస్కట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తొమ్మిది మంది తెలుగు కార్మికులతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం శ్రీకాకుళంలోని కార్యాలయం నుంచి వీడియో కాల్‌లో మాట్లాడారు. అక్కడి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన స్వదేశానికి సురక్షితంగా తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. కార్మికుల కుటుంబాలు అధైర్య పడొద్దని, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉద్యోగాల పేరిట కొందరు ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఆకర్షణీయమైన జీతం, ఎన్నెన్నో ప్రయోజనాలంటూ నిలువునా ముంచేస్తున్నారు. వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. తీరా విదేశాలకు వెళ్లాక వేరే పని చెబుతున్నారు. తాజాగా ఇలాంటి మోసమే వెలుగులోకి వచ్చింది. దళారుల బారినపడి ఇచ్ఛాపురం నియోజకవర్గానికి (మిగతా 8వ పేజీలో..)



కేంద్రమంత్రికి మస్కట్ నుంచి తమ సమస్యను వివరిస్తున్న జిల్లా కార్మికులు

- ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామానికి చెందిన దున్న కామరాజు కూలి పనికోసం ఈ ఏడాది జనవరిలో తోటి స్నేహితులతో కలిసి మస్కట్ వెళ్లాడు. టెక్నీషియన్ పని అని బ్రోకర్ చెప్పడంతో కామరాజు నమ్మాడు. బ్రోకర్‌కు రూ.70వేలు చెల్లించి మస్కట్ వెళ్లాడు. అక్కడకు వెళ్లిన తరువాత చెప్పిన పని ఇవ్వకుండా షిప్‌లు వాషింగ్ పని చేయించారు. తాను చేయలేనని చెప్పటంతో సరిగ్గా జీతం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు కామరాజు తన తల్లిదండ్రులు సారది, సావిత్రి, భార్య ఊహకు ఫోన్‌లో చెప్పాడు. కామరాజుకు 4 ఏళ్ల మురళీకృష్ణ అనే కొడుకు ఉన్నాడు. రెండో సంతానంగా ఈ ఏడాది ఫిబ్రవరి 6న యశ్విన్ (3 నెలలు) పుట్టాడు. బాబును వీడియో కాల్ చేయటంతో చూశాడు. బాబును కూడా చూడ లేకపోతున్నానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కన్నకొడుకు ఇబ్బందులు చూడలేక తల్లిదండ్రులతో పాటు భార్య ఊహ కూడా కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం స్పందించి మస్కట్‌లో ఉన్న వారందర్నీ ఇండియా తీసుకువచ్చే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చంటి బాబుతో కామరాజు భార్య ఊహ

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



శ్రీకాకుళంలో ఏసు శిలువ ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

శ్రీకాకుళంకల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. ఉదయాన్నే చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్లు బైబిల్‌ను చదివి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఏసు మార్గమే.. మానవాళికి జీవనమార్గం కావాలని సూచించారు. అందరూ సుఖసంతోషాలు, శాంతి కోసమే ఏసు ప్రాణత్యాగం చేశారన్నారు. శ్రీకాకుళం నగరంలోని చిన్నబజార్ తెలుగు బాప్టిస్ట్, టౌన్‌హాల్, ఆర్‌సీఎం లయోలా, ఉమెన్స్ కాలేజీ రోడ్‌లోని ఆరాధన కేంద్రం, తదితర చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ భక్తులు.. శిలువ మార్గంలో ఏసుక్రీస్తు పడిన శ్రమల పాట్లను వివిధ వేషధారణలతో కళ్లకు కట్టినట్టు చూపించారు. శిలువను మోస్తూ ఏసు ప్రభువు, ఇతర వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. ఏసు మన కోసమే జన్మించారని, మనందరి కోసం ప్రాణత్యాగం చేశారని, ఆయన రక్తం మనలను శుద్ధి చేస్తుందని తెలిపారు.

అకాల వర్షం.. రైతులకు నష్టం

- జిల్లా వ్యాప్తంగా వాన
- తడిచిన ధాన్యం
- పిడుగు పడి గరుడభద్రలో ఆవు మృతి
- పలుచోట్ల విద్యుత్ ఉపకరణాలు ధ్వంసం

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

జిల్లాలో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో రైతులకు నష్టం వాటిల్లింది. నరసన్నపేట, జమ్ము తదితర ప్రాంతాల్లో వరి, నువ్వు గింజలు తడిచిపోయాయి. జలుమూరు మండలంలోని జలుమూరు, కోనసింహాద్రిపేట, నామానాపేట, కెల్లివానిపేట, పాగోడు, సైరిగాం, తిమడాం, కొమనాపల్లి, తదితర ప్రాంతాల్లో ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు పాట్లు పడ్డారు. ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పారు. కల్లాల్లో చేరిన వర్షపు నీటిని బయటకు పంపించడానికి అష్ట కష్టాలు పడ్డారు. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర గ్రామానికి చెందిన బొల్ల సుజాతమ్మ ఆవు పిడుగుపాటుకు గురై మృతి చెందింది.



వజ్రపుకొత్తూరు: గరుడభద్రలో మృతిచెందిన ఆవు



జలుమూరు: ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

అలాగే, కంచిలి మండలంలోని గోకర్ణపురం, నారాయణపురం తదితర గ్రామాల్లో ట్రాన్సిస్టర్లు, టీవీలు, సెటాప్ బాక్స్‌లు, ఎల్ఈడీ టీవీలు, సీలింగ్ ఫ్యాన్‌లు ధ్వంసమయ్యాయి. ఈదురుగాలులకు జలుమూరులో మామిడి కాయలు రాలిపోవడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. కాగా, ఈ వర్షం చెరుకు, వేరుశనగ, నువ్వు, పొద్దుతిరుగుడు వంటి పంటలకు మేలు చేస్తుందని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పలాస రూరల్: తర్లాకోట వద్ద కురుస్తున్న వర్షం



ఇది మట్టి రోడ్డు కాదు.. తారు రోడ్డే!

ఇది మట్టి రోడ్డు అనుకుంటే పొరబడినట్టే. ఇది జాడుపల్లి జంక్షన్ నుంచి మారడికోట వెళ్లే తారు రోడ్డు దుస్థితి. ఓ వ్యక్తి రోడ్డు పక్కన మట్టిని తవ్వేసి వదిలేశాడు. దీంతో కిలో మీటర్ పొడవునా రహదారిపై మట్టి పేరుకుపోయింది. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. గత నెల రోజుల నుంచి ఈ పరిస్థితి ఉందని, చిన్న వర్షానికి బురదగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ రహదారిపై సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మారడికోట గ్రామానికి చెందిన తిరుపతిరావు తెలిపాడు.

-మెళియాపుట్టి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)

తిరుమల గోమరణాలపై
వైసీపీది దుష్ప్రచారం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

7లో

బీచ్ ఫెస్టివల్‌ను
విజయవంతం చేయాలి
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

7లో

సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారు

కవిటి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): లండారిపుట్టుగ పంచాయతీ పరిధిలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ప్రతిపక్ష నేత అడ్డుకుంటున్నారని సర్పంచ్ ఎం.కుమారి, సర్పంచ్ ప్రతినిధి ఎం.కాశీప్రసాద్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. కొండిపుట్టుగలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన తమకు అన్నివిధాలుగా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తమ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. ప్రస్తుతం పనులు కల్పించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శిలగాం రెవెన్యూ పరిధిలో 14 చెరువులు ఉన్నాయని... వాటిలో తమ పంచాయతీ వాసులకు పనులు చేసేందుకు వీలు కల్పించకుండా అడ్డుకుంటున్నారన్నారు. శావసానపుట్టుగలో వారం రోజులు పనికల్పించి ఆ తర్వాత నిలిపివేశారని వాపోయారు. పంచాయతీ మెరుగు పడకూడదనే రీతిలో ఆ నేత వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధపడుతున్నామని కుమారి, కాశీప్రసాద్‌లు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సోంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోంపేట సాయి గ్యాస్ ఏజెన్సీ వద్ద సిబ్బందికి ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఎస్.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'నవోదయం'తో నాటు సారా నిర్మూలన

సోంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి నాటుసారాను తరిమికొట్టేందుకు ప్రభుత్వం 'నవోదయం 2' కార్యక్రమాన్ని చేపడుతోందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డీ.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోంపేట స్టేషన్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.బాబీ, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించండి



ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

కవిటి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న విద్య, సంక్షేమ సహాయకులు (వెల్ఫేర్ అసిస్టెంట్లు)కు పదోన్నతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారంతా కోరారు. రామయ్యపుట్టుగలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే, విప్ బి.అశోక్‌ను కలసి వినతిపత్రాన్ని అందించారు. సీనియారిటీ ప్రాతిపదికన పేస్కేలు ఇవ్వాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే అశోక్ స్పందిస్తూ... ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే



డీఆర్‌వలస వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. శుక్రవారం దవళపేట, డీఆర్‌వలస గ్రామాలలో ప్రైవేటు కార్యక్రమాలకు హాజరైన ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. 'నమస్తే ఎచ్చెర్ల - మన ఊరికి మన ఎమ్మెల్యే' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన అతి కొద్ది నెలల్లోనే అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు బూరాడ వెంకటరమణ, కుమరాపు రవికుమార్, నక్క మురళి, అప్పన్న, ఉదయ్‌కుమార్, బోగాది అప్పలనాయుడు, చందు, గొర్లె లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ఉచితంగా ఫైబ్రోస్కాన్

అరసవల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): లివర్ డే సందర్భంగా శ్రీకాకుళం బ్రిడ్జి రోడ్డులో ఉన్న కేవైఎన్ ఆస్పత్రిలో జీర్ణకోశ, లివర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ పల్లి శ్రీహర్ష ఉచితంగా ఫైబ్రోస్కాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఫ్యాటీ లివర్ వ్యాధితో బాధ పడుతున్నారని తెలిపారు. దీనికి కారణం మధుమేహం, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్, మెటబాలిక్ సింగ్రోమ్ కలిగి ఉండడమని అన్నారు. అల్ట్రాసౌండ్, ఫైబ్రోస్కాన్ ద్వారా ఫ్యాటీ లివర్‌ను గుర్తించవచ్చని చెప్పారు. అది తెలుసుకుని కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేదంటే లివర్ సిర్రోసిస్, లివర్ క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందన్నారు. ఇది ఉన్న వారు స్వీట్లు, కూల్‌డ్రింక్స్, ఆల్కహాల్, ధూమపానం మానేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

జిల్లా వ్యాప్తంగా గుడ్ ఫ్రైడేవేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు వేషధారణలతో ర్యాలీలు నిర్వహించారు. చర్చిల్లో క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు స్ఫూర్తితో మానవ శ్రేయస్సు కోసం అందరం నిరంతరం కృషి చేయాలని హితవు పలికారు.

-ఆంధ్రజ్యోతి బృందం



హిరమండలంలో..



శ్రీకాకుళం: ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



శ్రీకాకుళం: బాప్టిస్టు చర్చిలో..



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్‌లో ఇలా..



సోంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం: క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్

యువతకు నైపుణ్య శిక్షణ

ఆమదాలవలస, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని స్థానిక టీడీపీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. దీన దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన గ్రామీణ యువతీ యువకులు నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు పొందవచ్చు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజనం, యూనిఫామ్, కోర్సు మెటీరియల్ అందించనున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని యువతీ యువకులందరూ ఈ అవకాశాలన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. శిక్షణ, కేంద్రాల వివరాల కోసం స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. నియోజకవర్గంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు కోరుతున్న అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సోంపేట యువకుడికి ఒకేసారి 4 ఉద్యోగాలు



రాహుల్

సోంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని గాంధీనగర్ వీధికి చెందిన గోకర్ల రాహుల్ ఒకేసారి 4 ఉద్యోగాలు సాధించాడు. రాహుల్ తండ్రి బాలరాజు టైలర్. తల్లి పద్మావతి కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నారు. అయినప్పటికీ కుమారుడిని కష్టపడి చదివించారు. ఆర్ఆర్‌బీలో క్లర్క్, బ్యాంక్ ఆఫ్ ఇండియా పీవో, బ్యాంక్ ఆఫ్ బరోడా క్లర్క్, యూనియన్ బ్యాంక్ ఎల్‌పీవోగా ఎంపికయ్యాడు. బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పీవోగా చేరేందుకు సిద్ధమవుతున్నాడు. కష్టపడి చదువుతూ నాలుగు ఉద్యోగాలు సాధించిన రాహుల్‌ను స్థానికులు అభినందించారు.

ఎమ్మెల్యేకి అభినందన

కవిటి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బెలగాం పంచాయతీకి చెందిన మణిచంద్రప్రకాష్‌కు ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వడంపై ఆ పంచాయతీ వాసులు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్‌ను శుక్రవారం కలసి అభినందనలు తెలిపారు. విప్ బి.అశోక్‌కు వారంతా స్వీట్లు తినిపించి.. దుశ్శాలువతో సత్కరించారు.

అతని చూపు సజీవం

అరసవల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని బలగ ప్రాంతానికి చెందిన కె.కామేశ్వరరావు (92) శుక్రవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్స్ పి.సుజాత, ఎస్.ఉమాశంకర్‌లు మృతుని నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి, విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావులు కామేశ్వరరావుకు ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

తిరుమల గోమరణాలపై వైసీపీది దుష్ప్రచారం: మంత్రి అచ్చెన్న

శ్రీకాకుళం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గో మరణాలపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. శుక్రవారం విలేకరులతో అచ్చెన్న మాట్లాడుతూ ఇలా అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అదో నల్లరాయి.. దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ గతంలో శ్రీవారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన భూమన.. గోమరణాలపై మాట్లాడటం హాస్యాస్పదం. మత విద్వేషాలను సృష్టించి రాష్ట్రంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించేలా కుట్ర జరుగుతోంది. గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకర రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవం. గడిచిన మూడు నెలల్లో వృద్ధాప్యం, వ్యాధుల కారణంగా 40 ఆవులు మృత్యువాత పడ్డాయి. 260 మంది ఉద్యోగులు గో సంరక్షణపై పని చేస్తుంటే పట్టించుకోవడం లేదని భూమన తప్పుడు ప్రచారం చేయడం హేయమైన చర్య' అని విమర్శించారు.

విద్వేషాలు పెంచేందుకు కుట్ర: ఎమ్మెల్యే

అరసవల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో ఆవుల మరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తూ.. మత విద్వేషాలు రేపేందుకు కుట్ర4 పన్నుతున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆరోపించారు. కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఆయన చేస్తున్న ప్రకటనలు ప్రశాంతతకు భంగం కలిగించేవిగా ఉన్నాయన్నారు. వేంకటేశ్వరుని నల్లరాయి అని, దానిపైకి చెప్పు విసిరితే ఏమవుతుందంటూ గతంలో దారుణంగా మాట్లాడిన వ్యక్తి కరుణాకరరెడ్డి అని విమర్శించారు. గోశాలలో 100 ఆవులు మరణించాయని అనడం సత్య దూరమని అన్నారు. టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఆయన చేసిన కుంభకోణాలు అందరికీ తెలుసని అన్నారు. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆరోపణలు చేస్తున్న ఆయనపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు.

బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలి



బీచ్‌లో పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

సోంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బారువలో 19, 20 తేదీల్లో నిర్వహించే బీచ్‌ఫెస్టివల్ కర్టన్‌రైజర్‌ను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కోరారు. ఈ కార్యక్రమం రాబోయే రోజుల్లో నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌కు దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు. బారువ రిసార్ట్‌లో ఎన్‌డీఏ కార్యకర్తలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో భారీ ఎత్తున బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ఈ కార్యక్రమం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్వరరావు, సీఐ మంగ రాజు, ఎన్‌డీఏ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

బారువలో శనివారం నుంచి నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచిపెట్టనున్నట్లు తెలిపారు.

శ్యాంపిస్టన్స్ కార్మికుల వేతనాలు చెల్లించండి



ధర్నా చేస్తున్న కార్మికులు

రణస్థలం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు మార్చి నెల వేతనాలను వెంటనే చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని సీటూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. వరిసాం వద్ద గల శ్యాంపిస్టన్స్ పరిశ్రమ గేటు ఎదురుగా శుక్రవారం సీటూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలవంతపు రిటైర్మెంట్లు నిలుపుదల చేయాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలనర్సయ్య, జి.కిరణ్, ఆర్.ఎస్.నాయుడు, కె.భోగేష్, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక తరగతుల విలీనం తగదు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హైస్కూళ్లలో ప్రాథమిక తరగతులను విలీనం చేయటం సమంజసం కాదని... 1, 2 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే ఉంచాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్వీ అనంతాచార్యులు ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని 900 ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతులను విలీనం చేస్తామని విద్యాశాఖ పేర్కొనడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తుంటే... హైస్కూళ్లలో విలీనం చేయాలని యోచించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీని వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా దెబ్బ తింటుందన్నారు.

కేంద్ర మంత్రికి అభినందన

గార, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎకనామిక్ ఫోరమ్ గ్లోబల్ యంగ్ లీడర్‌గా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎంపికపై మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పీసా వెంకట రమణమూర్తి, నాయకులు బడగల వెంకటఅప్పారావు, జి.వి.రమణ మూర్తి, గుండ బాస్కరరావు, కైబాడి రాజు, గోర సురేష్, మైగాపు ప్రభాకరరావు, వి.ఎస్.గిరి, కోరాడ వెంకటరావు, మళ్ల అబ్బాయి నాయుడు తదితరులు రామ్మోహన్‌నాయుడుకు అభినందనలు తెలిపారు.

24 నుంచి ఎమ్మెల్యే కప్ క్రికెట్

ఆమదాలవలస, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24వ తేదీ నుంచి జిల్లా స్థాయి ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 9848033159 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.



వేడుకగా జలయజ్ఞ శోభాయాత్ర



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీరామ తారక మహా మంత్ర యజ్ఞం సందర్భంగా బెల్లుపడ గ్రామస్థులు శుక్రవారం జల యజ్ఞ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. బెల్లుపడ నుంచి వందలాది మంది మహిళలు బిందెలు పట్టుకొని బాహుదా నదీ జలాల కోసం మేళ తాళాలతో వెళ్లారు. అటు నుంచి తీసుకొచ్చిన నీటిని ఆలయం వద్ద భద్రపరిచారు. శనివారం త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో జరగనున్న యజ్ఞంలో అభిషేకాలు, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకు రారోపణ, మృత్సంగ్రహణం, మండప ఆవాహనాలు, అగ్ని ప్రతిష్ఠ చేయనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు బెల్లుపడ గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు తెలిపారు. జలయాత్రలో ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌పాస్‌కు గ్రీన్ సిగ్నల్



రాజును సత్కరిస్తున్న ఆటో, ట్యాక్సీ యూనియన్ సభ్యులు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రజలు ఎన్నో ఏళ్లుగా రైల్వే అండర్‌పాస్ లేక ఇబ్బందులు పడుతున్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి రాజు పోరాటంతో రైల్వే అధికారులు ఇన్నాళ్లకు స్పందించారు. కొళిగాం రోడ్ రైల్వే అండర్‌పాస్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీన్ని అదృష్టంగా భావిస్తున్నామని పట్టణానికి చెందిన లారీ యూనియన్ అధ్యక్షులు పాతిర్ల ప్రతాప్‌రెడ్డి అన్నారు. మూడేళ్ల పోరాటానికి ఫలితంగా అండర్‌పాస్ మంజూరు కావటంతో శుక్రవారం రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద ఆటో, ట్యాక్సీ యూనియన్ సభ్యులు పాతిర్ల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అండర్‌పాస్ మంజూరుతో నియోజకవర్గంతో పాటు ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో గల సుమారు 30 గ్రామాల ప్రజల దీర్ఘకాల సమస్యకు పరిష్కారం దొరికిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు మోహన్, ఎర్రయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు సరిపోక.. రోగులకు సేవలందక

● కిందిస్థాయి సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం ● ఇదీ పొందూరు సీహెచ్‌సీలో పరిస్థితి



పొందూరు సీహెచ్‌సీ

పొందూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పొందూరు సీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులకు సేవలందని పరిస్థితినెలకొంది. ఈ నేపథ్యంలోఆసుపత్రిలో ఉండే కింది స్థాయి సిబ్బందితోనే చికిత్సలు చేయించుకోవాల్సి వస్తోంది. పొందూరులో సామాజిక ఆసుపత్రిలో పొందూరుతోపాటు జి.సిగడాం, సంతకవిటి, లావేరు మండలాల్లోని పలుగ్రామాల రోగులు వైద్య సేవలకు వస్తుంటారు. ప్రతిరోజూ 200మం దికి పైగా ఓపీసేవలు, 10నుంచి20మంది ఇన్ పేషెంట్ సేవలు పొందుతున్నారు.ఇక్కడ ఎనిమిది మంది వైద్యులు సేవలందించాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు వైద్యులు మాత్రమే ఉన్నారు. పిడియాట్రిషియన్ మెటర్నిటీలీవ్‌లో ఉండగా జనరల్ సర్జన్,ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.ఈనేపథ్యంలో ఎనిమిదిమంది వైద్యులకు నలుగురుమాత్రమే అందుబాటులో ఉండడంతో సేవలు సక్రమంగా అందడంలేదు.ఒక డాక్టర్ రాత్రి విధులు నిర్వహిస్తే ఆయనకు డేఆఫ్ ఉంటుంది. దీంతో రోజుకు ముగ్గురు లేదా ఇద్దరు వైద్యులతోనే ఆసుపత్రి నడుస్తోంది.

ఏ ఒక్క వైద్యుడైనా సెలవు పెడితే ఒకరు లేదా ఇద్దరుతోనే ఆసుపత్రి నెట్టుకు రావాల్సి వస్తోంది. దీంతో రోగులు ఆసుపత్రికి రావ డానికి ఆసక్తి కనబరచడంలేదు.ప్రధానంగా ప్రస్తుతం ఆసుపత్రిలో గైనకాలజిస్టు, ఎనస్తీషియన్ ఉన్నా రాత్రి సమయంలో వారిలో ఒకరు మాత్రమే విధులకు హాజరవుతుండడంతో గైనిక్‌కు సంబందించి అత్యవసర రోగులకు వైద్యసేవలు అందడం లేదు. దీంతో గైనిక్ పేషెంట్లు శ్రీకాకుళం, లేదా రాజాం ఆసుపత్రికి వెళ్లాల్సివస్తోంది. సీహెచ్‌సీలో 20 మంది వరకూకిందిస్థాయి సిబ్బంది ఉన్నారు. వైద్యులు అందుబాటులోని సమయంలోహెడ్,స్టాఫ్ నర్సులు, ల్యాబ్ సిబ్బంది రోగులకు సేవలందించాల్సివస్తోంది. కాగా ఆసుపత్రిలో ఎనిమిది మంది వైద్యులు అవసరం కాగా ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉన్నారని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.సుజాత తెలిపారు. కొంతమందికి డేఆఫ్ ఉండడంతో ఆసుపత్రిలో ముగ్గురు లేదా, ఇద్దరు ఒక్కోసారి కేవలం ఒక్కరు మాత్రమే ఉంటున్నారని చెప్పారు. దీంతో కొన్నిసార్లు అత్యవసరసేవలు అందించలేకపోతున్నామని తెలిపారు. వైద్యులకొరతపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని చెప్పారు.

జీడి కార్మికుడి ఆత్మహత్య


సాయి(ఫైల్)

పలాస,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీపరిధిలోగల లేబర్‌కాలనీకి చెందిన జీడికార్మికుడు కె.సాయి (21) శుక్రవారం ఆత్మహత్యకు పాలడ్డాడు. కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కథనం మేరకు.. లేబర్‌కాలనీకి చెందిన కె.కావ్య కుమారుడు సాయి స్థానికంగా ఉండే జీడి పరిశ్రమలో బాయిలింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సాయికి కడుపునొప్పి ఎక్కువగా ఉండడంతో మూడురోజుల నుంచి పరిశ్రమకు వెళ్లకుండా ఇంటివద్దే చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ఇంటి వద్దకు వెళ్లగా తలుపు గెడ పెట్టినట్లు తల్లి గుర్తించింది. దీంతో వెళ్లిచూడగా ఫ్యాన్‌కు ఉరిపోసుకొని ఉన్నట్లు తల్లి గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించింది. వారు చేరుకొని మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో వంశధార ఉద్యోగి మృతి

నరసన్నపేట,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి):వంశధార ఉద్యోగి కె.వెంకటరమణ గుండెపోటుతో మృతిచెందినట్లు పోలీసులు, కుటుంబసభ్యులు భావిస్తున్నారు. నరసన్నపేటలోని మారుతీనగర్ ఒకటోవీధిలో నివాసముంటున్న కొర్రాయి వెంకటరమణమూర్తి (51) మృతిచెందినట్లు స్థానికులు గురువారం సాయంత్రం గుర్తించిన విషయంవిదితమే. దీంతో స్థానికులు నరసన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈనేపథ్యంలో శుక్రవారం మారుతీనగర్-1లో వెంకటరమణ ఉంటున్న ఇంటిని కుమారుడు అనీల్ సమక్షంలో పోలీసులు తెరవగా కుర్చిలో మృతిచెంది ఉన్నాడు. కుర్చీ ముందుభాగంలో వాంతులైనట్లు ఆనవాళ్లు కనిపించాయి. మృతదేహం వద్ద దుర్వాసన రావడంతో సుమారు వారంరోజుల కిందట చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. కుమారుడు అనీల్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పలాస, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతువీధి గ్రామానికి చెందిన బాలిక సవర ప్రియాంక ఈనెల 14 నుంచి కనిపించడం లేదని ఆమె సోదరుడు జీవరత్నం కాశీబుగ్గ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదుచేశాడు. ప్రియాంక ఇంటర్ పూర్తి చేసి ఇంటివద్దే ఉంటోందని, పిన్ని సవర గాంచియాణి ఇంటికి ఈనెల 14న వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈక్రమంలో మరుసటి రోజు నుంచి కనిపించడం లేదని,చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం కనిపించకపోవడంతో ఫిర్యాదుచేశారు. సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేశారు.

1,900 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర గ్రామంలో శుక్రవారం సారాతయారీ కేంద్రాలపై టెక్కలి ఎక్సైజ్‌సిబ్బంది, స్థానిక పోలీస్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.ఈమేరకు 1,900లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్‌కే మీరాసాహెబ్ తెలిపారు.40 లీటర్ల సారను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ పిన్నింటి రమేష్‌బాబు పాల్గొన్నారు.

కారు బోల్తాపడి ముగ్గురికి గాయాలు

హరిపురం, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని బాలిగాం వద్ద జాతీయరహదారిలో ఓవర్‌బ్రిడ్జిపై కారుబోల్తాపడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మందస పోలీసుల కథనం మేరకు...బొబ్బిలి, రాజాంకు చెందిన శివ, రవితేజ, రేజా గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత బారువ వెళ్తుండగా.. కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ముగ్గురికి తల, కాళ్లపై గాయాలయ్యాయి.ఆ సమయంలో పలాస నుంచి హరిపురం ఆటోలో వెళ్తున్న ఆసుపత్రి మాజీ చైర్మన్ వాసు,మరోఇద్దరు అదేఆటోపై క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సచేసి మెరుగైన వైద్యంకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రమాద ఘటనపై మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ కేసునమోదుచేశారు.

రోడ్డుపై జారిపడి మహిళకు..

మెళియాపుట్టి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని మారడికోటకు చెందిన బి.లక్ష్మమ్మ ద్విచక్రవాహనంపై నుంచి జారిపడడంతో గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. జాడుపల్లి నుంచి మారడికోట వెళ్తున్న ద్విచక్రవాహనంపై వెనుక లక్ష్మమ్మ కూర్చొంది. అచ్చానాపురం సమీపంలో రోడ్డుపై మట్టి వేయడంతో వర్షానికి కరిగి వాహనంజారిపోడింది.దీంతో లక్ష్మమ్మ నడుముకు గాయాలయ్యాయి. దీంతో 108 వాహనం పై టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం


పలాస: మంటలను ఏ విధంగా అదుపు చేయాలో పవర్‌గ్రిడ్ సిబ్బందికి వివరిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

పలాస,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):ఏచిన్న అగ్నిప్రమాదం జరిగినా అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రాథమికంగా అదుపు చేసే నైపుణ్యత కలిగి ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారి బి.సోమేశ్వరరావు తెలిపారు. స్థానిక రామకృష్ణాపురం వద్ద ఉన్న పవర్‌గ్రిడ్ సిబ్బందికి కాశీబుగ్గ అగ్నిమాపకశాఖ అధికారులు అగ్రిప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ పంపిణీకేంద్రంలో పనిచేసే సిబ్బందికి ప్రమాదాలు జరిగితే ఏ విధంగా వాటినుంచి కాపాడుకోవాలో అవగాహన అవసరమన్నారు.కార్యక్రమంలో సిబ్బంది డి.భాస్కరరావు, కె.యుగంధర్, పి.మన్మథరావు, ఎ.సుదర్శనరావు పాల్గొన్నారు.

●పోలాకి,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లబంద, వెదుళ్లవలస,బెలమర పెట్రోల్ బంకుల వద్ద నిర్వాహకులకు అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవల్సిన చర్యలపై నరసన్నపేట అగ్నిమాపక అధికారి ఎస్.వరహాలు ఆధర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు.

●కొత్తూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):కొత్తూరులోని పెట్రోల్ బంకులో అగ్నిప్రమాదాలనివారణపై అగ్నిమాపకకేంద్రం అధికారి బుచ్చోడు అవగాహన కల్పించారు.ప్రమాదాలుజరిగే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.

వర్షం కురిస్తే.. తప్పని మురుగు కష్టాలు

● ఇదీ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని పూజారి వీధిలో దుస్థితి

కాశీబుగ్గ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీలో 11వ వార్డు పూజారివీధిలో గల రోడ్డులో చిన్నపాటి వర్షం కురిసినా అగచాట్లు తప్పడం లేదు. ప్రధానంగా మురుగు నీరు రోడ్డుపైకి, ఇళ్లలోకి చేరుతోంది. కాశీబుగ్గ రైల్వేగేటుకు ఆనుకొని ఉన్న పూజారివీధిలోకి మొయిన్ రోడ్డులో ఉన్న డ్రైనేజీ వర్షం నీటితో నిండిపోతోంది. దీంతో రోడ్డుపైకి మురికి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇళ్లలోకి చేరుతున్న మురుగు నీటిని బయటకు ఎత్తిపోయానికి అవస్థలకు గురవుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఇక్కడ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో కురిసిన వర్షానికి ఇళ్లు, రోడ్డుపైకి మురుగు నీరు చేరడంతో అవస్థలకు గురయ్యామని పలువురు వాపోయారు. తక్షణమే ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించి వర్షం కురిస్తే మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికుల కోరుతున్నారు.


పూజారివీధిలో రోడ్డుపైకి మురుగు నీరు చేరిన దృశ్యం

తప్పుడు ప్రచారం మానుకోండి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


పాతపట్నం:మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): టీటీడీపై తప్పుడు ప్రచారం మానుకోకుంటే ప్రజలే తగినబుద్ధి చెబుతారని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హెచ్చరించారు. శుక్రవారం పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ ప్రతిష్ఠను కించపరిచేలా వైసీపీనాయకుడు భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలిపారు.టీటీడీలో గోమరణాలపై కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కేవలం మతవిద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నానికి పాల్పడుతున్నారని విమర్శించారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అభివృద్ధిపనులకు అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మామిడిగోవిందరావు తెలిపారు. మండలంలోని తురకపేట జంక్షన్‌లో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ బస్టాప్‌ను ప్రారంభించారు.అలాగే చింతల బడవంజ సమీపంలో శుక్రవారం భారత్ పెట్రోలియం బంకును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి నాయకులు వి.ఆనందరావు, ఎస్.తేజేశ్వరరావు, ఎ.పోలినాయుడు, జి.మోహనరావు పాల్గొన్నారు.

వైసీపీ వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటు

● శ్రీకాకుళం పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణమూర్తి


మాట్లాడుతున్న కలమట వెంకటరమణ

కొత్తూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ విధ్వంసం పరిపాలన వల్ల ఉత్తరాంధ్ర వెనుకబాటుకు గురయ్యిందని శ్రీకాకుళం పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ధ్వజమెత్తారు.శుక్రవారం మండలంలోని మాతల క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాజదాని లేని విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆహోరాత్రులు కష్టపడి చేసిన అభివృద్ధిని దుర్మార్గవిధానాలతో వెనక్కి నెట్టారని ఆరోపించారు. వైసీపీ నాయకులు లూలు గ్రూపు సంస్థ పారిపోయేలా చేసి ఉత్తరాంధ్ర యువత పొట్టకొట్టారని విమర్శించారు. రుషికొండ ఐటీ సెజ్ నుంచి 14 కంపెనీలు పారిపోయేలా చేయడమే కాకుండా ఫ్రాంక్లిన్ టెంప్లన్, హెచ్‌సీఎల్, ఐబీమ్, ఫింటెక్స్, హెచ్ఎస్‌బీసీ, షుగర్ ఫ్యాక్టరీలు, దిగ్గజ కంపెనీలు వైసీపీనాయకులదాష్టికాలను భరించలేక రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు.టీడీపీప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖలో టీసీఎస్ రూ.1370 కోట్లు పెట్టుబడితో 12వేలమందికి ఉద్యోగాల కల్పనకు ముందుకొస్తోందని తెలిపారు.

త్వరలో ఫ్లైఓవర్ పనులు ప్రారంభం

● అదనంగా ట్యాంకర్లతో నీటి సరఫరా ● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.48 కోట్లు కేటాయించడంతో పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శుక్రవారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 27వవార్డు భద్రమ్మకోనేరు వద్ద రూ.27 లక్షలతో నిర్మించనున్న ప్రహరీకి భూమిపూజచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే తాగునీటి కోసం రూ.63 లక్షలు కేటాయించగా పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు అదనంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు,ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, మునిసిపల్ చైర్మన్ బళ్లగిరిబాబు, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, ఎం.నరేంద్ర(చిన్ని), ఎ.రామకృష్ణ, కొత్త సత్యం పాల్గొన్నారు.

నువ్వలరేవులో శాంతి హోమం


నువ్వలరేవులో పూజలు నిర్వహిస్తున్న గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నువ్వలరేవులో బృందావతిమాత ఆలయ సన్నిధిలో శుక్రవారం శాంతిహోమం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న హోమం 24 గంటలపాటు చేపడుతున్నామని సర్పంచ్ ముువ్వల పూర్ణ చెప్పారు. శాంతిహోమం నిర్వహిస్తే ఆటంకాలు తొలగి శుభాలు కలుగుతాయని గ్రామస్థుల నమ్మకం. ప్రతి ఇంటిముందు కలశంపై కొబ్బరికాయను ఉంచి పూజలు నిర్వహించారు. మహిళలు పసుపునీటితో ఉన్న కలశం తీసుకువెళ్లి అభిషేకాలు చేయించారు. ఎమ్మెల్యే గౌతుశిరీష శాంతి హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆనంద్, వెంకటేష్, వెంకటరమణ,నీలాంబర్ పాల్గొన్నారు.

వర్గీకరణ ఆర్డినెన్స్ ఆమోదంపై హర్షం

పాతపట్నం, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభించడంపై టీడీపీ నాయకుడు సీమ రామకృష్ణతో పాటు పలువురు హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం పాతపట్నంలోని అంతరాబకూడలిలో దళిత నాయకులు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలఅభిషేకం చేశారు. కార్యక్రమంలో కొరసవాడ సర్పంచ్ చింతలఉమ, ఎం.బాబూరావు, జి.అప్పారావు, ఎస్.ఆనందరావు పాల్గొన్నారు.

'నాకాబందీ'లో 2,437 వాహనాల తనిఖీ

శ్రీకాకుళం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి మూడు గంటల వ్యవధిలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 12 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 33 సబ్ ఇన్‌స్పెక్టర్లతో వేర్వేరు బృందాలుగా ఏర్పడి.. 48 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాత్రి 9 నుంచి 11 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. మొత్తం 2,437 వాహనాలను తనిఖీచేశారు. 46 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులను నమోదు చేశారు. 12 వాహనాలను సీజ్‌చేశారు. సరైన పత్రాలు చూకపోవడంతోమూడుమోటారు సైకిళ్లను, ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోను, మద్యం తాగి బైక్ నడుపుతున్న వారి నుంచి ఏడు బైక్‌లు, అలాగే డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఆటో డ్రైవర్ నుంచి ఓ ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సత్తాచాటిన విద్యార్థి

కోటబొమ్మాళి,ఏప్రిల్18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న నందిగాం నవ్య ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణపై అవగాహన కోసం జిల్లాస్థాయిలో విద్యాశాఖ శుక్రవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సత్తాచాటింది. ఈమేరకు ద్వితీయ బహుమతి సాధించింది. బారువ బీచ్‌లో శనివారం జరగనున్న ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల పండుగ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా నవ్య బహుమతి అందుకోనుంది.ఈసందర్భంగా నవ్యకు, తర్ఫీదు ఇచ్చిన చిత్రలేఖనం ఉపాధ్యాయులు పాపారావుకు ఎంఈవోలు గోవిం ద, ఎల్వీప్రతాప్, హెచ్ఎం డి.గోవిందరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

తెలుగు సాహితీ సంబరాలకు కళాసమితి సభ్యులకు ఆహ్వానం

టెక్కలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): టెక్కలి ప్రజాచైతన్య కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డీఏస్టాలిన్, ఉత్తమ నటుడు, రచయిత, కవిరేజేటి వెంకటరమణ మూర్తి, యువ రచయిత దూసి భరత్‌కు మార్‌కు ఏలూరులో మే10,11తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానంఅందింది.కళాసమితి సభ్యులకు అవకాశం లభించినందుకు ప్రతినిధులు చిలుకు కృష్ణారావు, యు.గణపతిరావు, బమ్మిడి కృష్ణారావు, మూల తాతయ్య, అనిశెట్టి చిట్టన్న, ఎం.పద్మనాభ రావు, ఆర్.రమేష్‌కుమార్, వాడాడ శీనివాస రావు, మోహనరావు అభినందించారు.

కార్యదర్శిగా కిశోర్

మెళియాపుట్టి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి పంచాయతీకార్యదర్శిగా ఎట్టకేలకు కిశోర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.మూడేళ్లుగా ఇక్కడ రెగ్యులర్ కార్యదర్శిలేరు.ఇటీవల పంచాయతీరాజ్‌శాఖలో పదోన్నతులు కల్పించారు.దీంతో పాతపట్నం పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిశోర్‌కు మెళియాపుట్టి కార్యదర్శిగా నియమించారు.

వేతనాలు చెల్లించాలి

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం కోరారు. ఎల్.ఎన్.పేట సమీపంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద వేతనదారులతో మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


కొత్తూరు: సిరుసువాడ పాఠశాలలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని సిరుసువాడలో ఉపాధ్యా యులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని శుక్రవారం ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడి కేంద్రాలు నుంచి ప్రీస్కూల్ పిల్లలను, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.పోలినాయుడు, ఎంపీటీసీ చెంగల దివ్య, ఉపాధ్యాయులు గున్నమ్మ, వై.సత్యనారాయణ, ఎం.లోకేష్ పాల్గొన్నారు.

● జలుమూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని, తల్లిదండ్రులు సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని లింగాలవలస ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉంగటి అప్పల సూర్యనారాయణ కోరారు. శుక్రవారం లింగాలవలస తదితర పాఠశాలకు పరిసర గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బడిఈడు పిల్లలను, ఐదు నుంచి ఆరో తరగతిలో చేరే పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ప్రకటనలను చూసి మోసపోవద్దని, కార్పొరేట్ చదువులు పేరిట దోచుకుంటున్నారని తెలిపారు. అంగనవాడీ కేంద్రాల నుంచి బయటకు వెళ్లే పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కార్యకర్తలను కోరారు.

నిర్వహణ లేక.. వినియోగానికి నోచుకోక

● మాకన్నపల్లి చెరువులో గుర్రపుడెక్క వల్ల నీరు కలుషితం

పలాస రూరల్,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకన్నపల్లి చెరువులో గుర్రపుడెక్క నెలల తరబడి పేరుకుపోవడంతో నీరు కలుషిత మవుతోంది. దీంతో స్నానాలతో పాటు తాగు అవసరాలకు ఉపయోగపడడంలేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇక్కడి సచివాలయం ఎదురుగా ఉన్న చెరువులో నీరు పుష్కలంగా ఉన్నా గుర్రపుడెక్క పెరగడం, ప్రధానంగా నిర్వహణ లోపం వల్ల వల్ల వినియోగానికి వీల్లేకుండాపోయింది. చెరువును దూరం నుంచి చూస్తే గుర్రపుడెక్క వల్ల క్రికెట్ గ్రౌండ్ మాదిరిగా కనిపిస్తోంది. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


చెరువులో పెరిగిన గుర్రపుడెక్క

జీతాల్లేవ్.. తిండీ లేదు!

(ఐదో పేజీ తరువాయి)

చెందిన 9 మంది మస్కట్‌లో చిక్కుకున్నారు. ఇచ్ఛాపురం మండలం ధర్మపురానికి చెందిన జాని, కోటబొమ్మాళిలోని ఒక టెక్నికల్ ఇనిస్టిట్యూట్ ద్వారా తొమ్మిది మంది మస్కట్‌లోని నజీమ్ అబ్దుల్ సలాం ఇంటర్నేషనల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనికి కుదిర్చారు. అక్కడకు వెళితే ఆకర్షణీయమైన జీతంతో పాటు భోజనం, ఇతరత్రా వసతులు కల్పిస్తారని చెప్పారు. తీరా అక్కడకు వెళ్లాక షిప్‌లు క్లీనింగ్ చేసే పనిలో పెట్టారు.జీతాలు ఇవ్వలేదు సరికదా భోజనాలు కూడా పెట్టడంలేదు.దీంతో బాధితులు ధర్మపురానికి చెందిన జానిని ప్రశ్నిస్తుంటే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. కనీసం పట్టించుకోవడం లేదు. కంపెనీ నిర్వాహకులు పాస్‌పోర్టులను సైతం తీసుకొని ఇబ్బందులు పెడుతున్నారు. ఈ విషయాన్ని వారు ఫోన్‌లో కుటుంబసభ్యులు తెలపడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమ వారిని క్షేమంగా ఇంటికి తీసుకురాఆవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం మస్కట్‌లో చిక్కుకున్న వారిలో దున్న కామరాజు, దున్న హేమసుం దరరావు, డల్లీ జానకిరావు, ఏరాల రామకృష్ణ, బి.దుర్యోధన, ఎంపల్లి రాజు, పిల్ల సతీష్, పిలక భాస్కరావు, గుజ్జు జగదీష్ తదితరులు ఉన్నారు. బాధిత కుటంబసభ్యులు స్థానిక పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు చేశారు.

తరచూ మోసాలు..

గత కొద్దిరోజుఉలుగా జిల్లాలో విదేశీ ఉద్యోగాల పేరుతో ఎక్కువగా మోసాలు వెలుగుచూస్తున్నాయి. ఇంటర్వ్యూల సమయంలో చెప్పింది ఒకటి. అక్కడకు వెళ్లిన తరువాత పనులు మరొకటి అన్నట్టు ఉంది పరిస్థితి. దళారుల ద్వారా వెళుతున్న వారే ఎక్కువగా మోసాల బారిన పడుతున్నారు. అయితే ఇప్పుడు దళారులు గ్రామాల్లోకి సైతం వచ్చి ఆకర్షణీయమైన జీతం అంటూ నిరుద్యోగ యువతను ఆకర్షిస్తున్నారు. అధిక మొత్తంలో గుంజుకొని మోసాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా ఇచ్ఛాపురం కేంద్రంగా చేసుకొని విదేశీ ఉద్యోగాల ఇంటర్వ్యూలు చేస్తుంటారు. జిల్లాలో టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఎక్కువగా విదేశాలకు వెళుతుంటారు. భవన నిర్మాణంతో పాటు పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తుంటారు. పదో తరగతి వరకూ చదవడం.. వెల్డర్, ఫిట్టర్, ఫ్యాబ్రికేటర్‌గా శిక్షణ తీసుకోవడం.. తరువాత ఉపాధి బాట పట్టడం ఉద్దానంలో పరిపాటిగా మారింది. అయితే గతం మాదిరిగా విదేశాల్లో ఉద్యోగాలు ఎమంత ఆశాజనకంగా లేవు. మేన్ పవర్ సొసైటీలు రంగంలోకి దిగి సొమ్ము చేసుకుంటున్నాయి. అభ్యర్థులను పంపించి వారిపై కమీషన్లను దండుకుంటోంది. గతంలో నైపుణ్యం చూసి.. సదరు కంపెనీలు తమకు విదేశాల్లో ఉండే పరిశ్రమలకు పంపించేవి. విమాన టిక్కెట్లతో పాటు వీసా, వసతి ఇలా అన్నింటినీ సమకూర్చేవి. దీంతో విదేశాల్లో పనిచేయడం లాభసాటిగా ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అంతటా బ్రోకర్ వ్యవస్థ నడుస్తోంది. మేన్ పవర్ ఏజెన్సీలు, శిక్షణ సంస్థల మాటున విదేశీ పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎంపిక చేసినందుకు కమీషన్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎక్కువగా బోగస్ కంపెనీల పేరుతో ఇంటర్వూలు నిర్వహిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

స్థానికంగానే ఇంటర్వ్యూలు..

ఇచ్ఛాపురం పట్టణంలో ఎక్కువగా బోగస్ సంస్థలు వెలుస్తున్నాయి. స్థానికంగానే అభ్యర్థులకు వెల్డింగ్‌లో శిక్షణనిస్తున్నారు. అరకొర శిక్షణ ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఒకవేళ విదేశాలకు వెళ్లినా అక్కడ పని ఒత్తడి తట్టుకోలేక తిరిగి వచ్చిన వారు ఉన్నారు. మరికొందరైతే అక్కడ వాతావరణ పరిస్థితులు అనుకూలించక చాలా మంది మృత్యువాత పడుతుంటారు. అక్కడ పరిశ్రమల్లో కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాల బారినపడుతుంటారు. చాలా మంది చనిపోతుంటారు. మరికొందరు క్షతగాత్రులుగా మిగులుతుంటారు. అటువంటి సమయంలో మృతదేహాలను స్వస్థలాలకు తెప్పించడం కత్తిమీద సాములా మారుతుంది. అక్కడ నిబంధనలు అడ్డంకిగా మారుతాయి. అటువంటి సమయంలో మృతదేహాల కోసం బాధిత కుటుంబ సభ్యులు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తుంది. అయితే బోగస్ సంస్థలే ఎక్కువగా మోసాలు చేస్తున్న దృష్ట్యా వాటిపై దృష్టిపెట్టాల్సిన అవసరముంది.

హమ్మయ్య.. ఇప్పుడు దాహం తీరింది

ఎండలు మండుతున్నాయి. జంతువులు, పశుపక్ష్యాదులు ఎండల తీవ్రతకు దాహంతో అల్లాడుతున్నాయి.ఎక్కడ నీరు దొరుకుతుందా అని ఆత్రంగా ఎదురు చూస్తున్నాయి. దీనికి తార్కాణమే ఈ చిత్రం. నందిగాంలోని ఓ కుళాయిలో నీరు రావడంతో అక్కడే ఉన్న ఓ శునకం ఆ నీటితో దాహం తీర్చుకుంది. అక్కడితో ఆగకుండా కుళాయి ముందు నిలుచొని ఒంటి నిండా నీరుపడేలా చేసుకొని... అక్కడి నుంచి కదిలింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు.. శునకం నీరు తాగేవరకూ దానికి ఇబ్బంది పెట్టకుండా దూరంగా ఉండిపోయారు. -నందిగాం


నందిగాంలో ఓ కుళాయి ట్యాప్ వద్ద దాహార్తిని తీర్చుకుంటున్న కుక్క